

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 5,93,589, బంగారం 4 గ్రాముల 350 మిల్లీ గ్రాములు, వెండి 49 గ్రాముల 300 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఘనంగా దుర్గాదేవికి పూజలు

దసరా శరన్నవరాత్రి వేడుకలు గురువారంతో వైభవంగా ముగిశాయి. - 10లో.



మహాత్మునికి ఘనంగా నివాళి

స్థానిక గాంధీ పార్కులో మహాత్మగాంధీ జయంతిని గురువారం జిల్లా యంత్రాంగం ఘనంగా జరుపుకుంది. - 10లో.

న్యూస్‌రీల్

కొండచిలువ హల్ చల్



బెంచీ కింద దాగి ఉన్న కొండచిలువను పట్టుకుంటున్న దృశ్యం

రాయగడ: సదరు సమితి మల్లిగాంలోని ఓ హోటల్ ముందు కొండచిలువ హల్‌చల్ చేసింది. వర్షాల కారణంగా హోటల్‌ను మూసివేశారు. సమీపంలోని తుప్పల్లో నుంచి వచ్చిన కొండచిలువ హోటల్‌లోని బెంచికింద ఉండిపోయింది. గురువారం తెరిచేందుకు వెళ్లిన యజమానికి బెంచి కింద పాము కనిపించడంతో భయంతో పరుగులు తీశాడు. వెంటనే స్నేక్ క్యాచర్ ప్రదీప్ కుమార్ సేనాపతికి సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న ఆయన పామును పట్టి సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టాడు.

లక్ష్మి ఇక లేదు



పి. లక్ష్మి

భువనేశ్వర్: పూరీ స్వర్గ ద్వారం శ్మశాన వాటికలో అంత్యక్రియల దశలో మేలుకొని కళ్లు తెరిచిన 86 ఏళ్ల పి.లక్ష్మి శాశ్వతంగా కళ్ళు మూశారు. గత నెల 15న ఈ ఆశ్చర్యకర సంఘటన చోటు చేసుకుంది. అది మొదలు కొని ఆమె పూరీ జిల్లా ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నెల ఒకటో తేదీ బుధవారం రాత్రి ఆమె మరణించినట్లు వైద్యులు ప్రకటించారు.

ఇద్దరికి ఎక్స్‌గ్రేషియా ప్రకటన

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో రెండురోజులుగా కురిసిన వర్షాలకు కొండచరియలు విరిగిపడి, వరదల్లో కొట్టుకుపోయి మృతి చెందిన ఆర్.ఉదయగిరి సమితి బస్త్రిగుడ గ్రామానికి చెందిన త్రినాథ నాయక్, మోహనా సమితి మెరాపల్లి గ్రామ పంచాయతీ వాసి లక్ష్మణ్ నాయక్‌ల కుటుంబాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు నష్టపరిహారం కింద రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్టు జిల్లా కలెక్టర్ మధుమిత తెలియజేశారు.

మోటు నుంచి కాంగ్రెస్ నేతల పాదయాత్ర



మోటు ముగీ పాయింట్ వద్దకు చేరుకున్న రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్ దాస్, ఇతర నేతలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మోటు ముగీ పాయింట్ నుంచి గురువారం రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్ దాస్ పాదయాత్ర ప్రారంభించారు. గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేతలు పాదయాత్ర నిర్వహించారు. ముందుగా మోటు ముగీ పాయింట్ దగ్గర ఉన్న గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రజలతో పలు అంశాలపై చర్చించారు. పాదయాత్ర మోటు నుంచి మల్కన్‌గిరి వరకు సాగింది. కార్యక్రమంలో రాష్ట్ర యువ కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కృష్ణచంద్ర మహంతి, మల్కన్‌గిరి కాంగ్రెస్ అధ్యక్షుడు జి.శ్రీనివాసురావు, మాజీ అధ్యక్షుడు గోవింద పాత్రో, చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖీలో తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

చినుకు.. వణుకు



పెక్కట గ్రామం మొలసాయి వద్ద కొట్టుకుపోయిన గ్రామం



మోహన బ్లాక్ నడిబొందనల్లా ఉప్పొంగడంతో కొట్టుకుపోయిన వంతెన



మహేంద్రగిరి రహదారికి అడ్డంగా పడిపోయిన కొండచరియలు

పర్లాకిమిడి: భారీ వర్షాలకు గజపతి జిల్లా చివురుటాకులా వణికింది. బుధవారం, గురువారం కురిసిన భారీ వర్షాలకు రాయగఢ, మోహన, నువాగడ, మహేంద్రగడ, గుమ్మలో కొండ చరియలు విరిగిపడటంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. జిల్లాలో విజయ దశమి నాడు కురిసిన వర్షం తిత్లీ తుఫాను మరపించింది. రాయఘడ బ్లాక్ పెక్కట గ్రామం మౌలసాయి వద్ద కొండ చరియలు విరిగిపడటంతో పొలానికి వెళ్లి తిరిగి వస్తున్న తండ్రీకొడుకులు రజికా శోబోరో (35), తండ్రి కార్తీక్ శోబోరో (65) కొట్టుకుపోయారు. వారి మృతదేహాలు ఇంతవరకూ దొరకలేదు. ఆర్.ఉదయగిరి బ్లాక్‌లో బస్త్రిగుడ వద్ద కొండ చరియలు విరిగి పడటంతో త్రినాథ నాయక్ (50) మృతి చెందారు. ఆర్.ఉదయగిరి బదిశల ఘాట్ వద్ద గురువారం కురిసిన భారీ వర్షాలకు జాతీయ రహదారి 326ఎ ధ్వంసమైంది. మోహన బ్లాక్‌లో నడిబోందో నల్లా ఉప్పొంగడంతో జాతీయ రహదారి (326ఎ) పాత వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. అటు రాయగడ, మోహన, పర్లాకిమిడికి వెళ్లే వాహనాలు బంద్ అయ్యాయి. మోహనలో ఎడతెరిపి వర్షాలకు బందగుడ గ్రామానికి చెందిన లక్షణ్ నాయక్ (40) లుద్రునల్లాలో కొట్టుకుపోయాడు. ఆయన మృతదేహాన్ని శుక్రవారం ఓడ్రాఫ్ సిబ్బంది బయటకు తీసినట్టు ఎస్పీ జె.ఎస్.పండా తెలియజేశారు. రాయఘడ బ్లాక్ మహేంద్రగడ-బురుఖాత్ పాస్ వద్ద కొండచరియలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడటంతో గత రాత్రి మహేంద్రగిరికి వెళ్లిన టూరిస్టులు 22 మంది చిక్కుకున్నారు. గురువారం రాత్రి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బిభూతీ జెన్నా ముఖ్యమంత్రి మోహన్ మఝి ఆదేశాల మేరకు బురుఖాత్ పాస్‌కు హుటాహుటిన చేరుకుని జేసీబీలతో రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న బండరాళ్లను పక్కకు తీసి రోడ్డు క్లియర్ చేశారు. దీంతో ఇతర జిల్లాల నుంచి వచ్చిన టూరిస్టులు మహేంద్రం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. గుమ్మబ్లాక్ సెరంగో, అజయగడ వద్ద కొండచరియలు విరిగి పడటంతో రోడ్డు బ్లాక్ అయ్యింది. అలాగే ఖోజురిపద నుండి నువాగడ బ్లాక్ రోడ్డులో అసురపహాడ్ నల్లా ఉద్ధృతంగా ప్రవహించడంతో అక్కడ నిర్మాణంలో ఉన్న వంతెన కొట్టుకుపోయింది. అతివృష్టి కారణంగా నువాగడ శివాలయం వద్ద నువాగడ- గుణుపురం రోడ్డు కూడా కొట్టుకుపోయింది. అధిక వర్షాల వల్ల రోడ్లు, భవనాల శాఖకు వందల కోట్ల నష్టం వాటిల్లగా, గ్రామీణ రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడంతో నష్టం రూ.కోట్లలో వాటిల్లినట్లు రాష్ట్ర రవాణా శాఖా మంత్రి బిభూతీ జెన్నా విలేకరులతో తెలిపారు.



రాయఘడ బ్లాక్ వద్ద కొట్టుకుపోయిన రహదారి



రాణిపేట వద్ద గుమ్మగెడ్డ దృశ్యం

రాయగడ జలమయం

రాయగడ: బుధవారం ఏకధాటిగా కురిసిన వానకు రాయగడ నీటమునిగింది. స్థానిక మజ్జిగౌరి మందిరం సమీపంలో గల రైల్వే ట్రాక్ వద్ద కొండచరియలు విరిగి పడిపోవడంతో ట్రాక్ ముక్కలైంది. దీంతో రాయగడ మీదుగా రాకపోకలు నిలిచిపోయాయి. సింగిల్ లైన్ మీదుగా రైళ్ల రాకపోకలు సాగించారు. సమాచారం తెలుసుకున్న డీఆర్‌ఎం అమితాబ్ సింఘాల్, అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. రాయగడ మీదుగా విశాఖపట్నం ఇటు రాయిపూర్ ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాక్ మరమ్మతు పనులతో పాటు కొండచరియలు తొలగించే కార్యక్రమం యుద్ధ ప్రాదిపదికన జరిగింది. దీంతో పలు రైళ్లను రద్దు చేశారు.

సదరు సమితి పిప్పలగుడ గ్రామంలో చంద్ర మండంగికి చెందిన ఇల్లు కూలిపోయింది. గుణుపూర్‌లో అరటి, వరి తదితర పంటలు నీట మునిగాయి. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ప్రహరీ వర్షాలకు కుప్పకూలింది. కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక జిల్లాలోని గుణుపూర్‌లో బుధవారం పర్యటించారు. వర్షం వల్ల కలిగే నష్టాలను అంచనా వేసేందుకు ప్రత్యేకంగా ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగొతొ ఆయన వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. కలెక్టర్ అశుతోష్ కులకర్ణి గురువారం గుణుపూర్‌లో పర్యటించారు. వర్షాల వల్ల నష్టపోయిన ప్రాంతాలు కలియదిరిగారు. తెగిన రోడ్ల పరిస్థితిని పరిశీలించారు.



గుణుపూర్‌లో నేలకూలిన అరటి తోట



పిప్పలగుడలో కూలిన ఇల్లు



బైక్‌పై వెళుతున్న ఎంపీ సప్తగిరి



గుణుపూర్‌లో వర్షాల వల్ల కలిగే నష్టాలను పరిశీలించేందుకు వెళ్లిన కలెక్టర్ కులకర్ణి



బండరాళ్లు పడటంతో విరిగిన ట్రాక్


సిమిలిగుడ సమితిలో వర్షపు నీటికి పాడైన పొలాలు



తడిచిముద్దయిన కొరాపుట్



సిమిలిగుడ సమీపంలో జాతీయ రహదారి పై నీరు



దుమ్రిపుట్ వద్ద ట్రాక్ మీద పడ్డ రాళ్లు

కొరాపుట్: భారీ వర్షాలకు కొరాపుట్ జిల్లాలు తడిసి ముద్దయ్యాయి. గురు, శుక్రవారాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురిశాయి. కొరాపుట్-రాయగడ మార్గంలో బంగ్లాగుడ వద్ద వరద నీరు రోడ్డెక్కింది. దాంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచి పోయాయి. మరో వైపు సిమిలిగుడ వద్ద విశాఖ పట్నం మార్గంలో కూడా వర్షం నీరు రోడ్డు మీద ప్రవహించింది. కొరాపుట్ సమీపంలో దుమ్రి పుట రాళ్లు, మట్టి రైల్వే ట్రాక్ మీద పడ్డాయి. దాంతో ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిపివేశారు. రైల్వే విభాగ అత్యవసర పునరుద్ధరణ తర్వాత రైళ్లు నడుపుతున్నారు. కొలాబ్ రిజర్వాయర్ నీరు ప్రమాద సూచిక వద్దకు చేరడంతో గేట్లు తెరిచారు. సిమిలిగుడ సమితిలో వర్షం నీరు పోటెత్తింది.



కొరాపుట్-రాయగడ మధ్య బంగ్లాగుడ వద్ద రోడ్డెక్కిన నీరు

శ్రీమందిరంలో కార్తీక సేవలు ప్రారంభం



సీఏఓ అధ్యక్షతన ఛొత్తీషా నియోగుల సమావేశం

- రాధా దామోదర అలంకరణ
- ఈ నెల 7 నుంచి కార్తీక వ్రతం



రాధా దామోదర అలంకరణ

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని దేవస్థానంలో కార్తీక మాసం ప్రత్యేక సేవాదులు ప్రారంభించారు. శుక్రవారం పవిత్ర అశ్విని శుక్ల పక్ష ఏకాదశి తిథి పాపాంకుశ ఏకాదశి నుండి కార్తీక శుక్ల దశమి వరకు ఈ సేవలు నిరవధికంగా కొనసాగుతాయి. ఈ సందర్భంగా రత్న వేదికపై శ్రీ మందిరంలో దేవతా త్రయానికి రాయ్ దామోదర అలంకరణ నిర్వహిస్తారు. నిత్యం ప్రాతః శుద్ధి (ఒబొకాసా) వెంబడి మూల విరాట్లకు రత్న సింహాసనంపై రాధా దామోదర అలంకరణ లేదా రాయ్ దామోదర అలంకరణ చేస్తారు. మరో వైపు కార్తీక వ్రతం, బాల ధూపం ప్రారంభం అవుతుంది. ఈ కార్యక్రమాలు నిరవధికంగా నెల రోజులపాటు కొనసాగుతాయి. కార్తీక మాసంలో శ్రీ జగన్నాథుడిని (విష్ణువు) దామోదరుడిగా పూజిస్తారు. ఈ సందర్భంగా చేసే అలంకరణను రాధా దామోదర అలంకరణగా పేర్కొంటారు. శ్రీ మందిరం ప్రధాన నిర్వాహకుడు డాక్టరు అరవింద కుమార్ పాఢి అధ్యక్షతన జరిగిన ఛొత్తీషా నియోగుల సమావేశంలో కార్తీక మాసం ప్రత్యేక సేవాదుల కార్యక్రమాలు ఖరారు చేశారు. ఈ సమావేశంలో నిర్ణయం మేరకు నిత్యం ఉదయం 4 గంటలకు ప్రధాన దేవస్థానం ద్వారం తలుపులు తెరిచి నిత్య సేవలు ఆరంభిస్తారని తెలిపారు.

కార్తీకంతో వరుస దర్శనం వాయిదా

పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకుని శ్రీ మందిరం భక్తుల తాకడితో కిటకిటలాడుతుంది. ప్రత్యేక సేవాదులు నిరవధికంగా కొనసాగుతాయి. ఈ పరిస్థితుల దృష్ట్యా శ్రీ మందిరంలో మూల విరాటుల వరుస దర్శనం వ్యవస్థని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు శ్రీ మందిరం సీఏఓ డాక్టరు అరవింద కుమార్ పాఢి తెలిపారు. ఆలయం లోపల మొబైల్ ఫోన్ల వాడకంపై నిషేధం, దివ్యాంగులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు యోచిస్తున్నారు. ఆలయ సంప్రదాయాలు ప్రభావితం కాకుండా ఈ వర్గం భక్తులకు ప్రత్యేక దర్శన సౌకర్యం త్వరలో అందుబాటులోకి రానుంది. దీని కోసం ప్రత్యేక ప్రామాణిక నిర్వహణ మార్గదర్శకాలు (ఎస్ఓపీ) రూపుదిద్దుకుంటున్నాయి. ప్రధానంగా జగన్నాథ ఆలయ పోలీసులపై (జేటీపీ) ఫోన్ల వాడకంపై ఆంక్షలు ఖరారు చేసిన తర్వాత ఆలయ సేవకులు మొబైలు ఫోనుల వినియోగంపై ఆంక్షలు జారీ చేస్తారు. ప్రతి బుధవారం ఒక సమన్వయ కమిటీ సమావేశమై శ్రీ మందిరం నిత్య దైనందిన కార్యకలాపాల్లో వివిధ వర్గాల పని తీరులో క్రమశిక్షణని సమీక్షిస్తారని సీఏఓ తెలిపారు.

జైలు నుంచి తప్పించుకున్న ఖైదీలు



చౌద్వార్ సర్కిల్ జైలు

- ఆచూకీ తెలిపిన వారికి రూ. 50,000 నగదు పురస్కారం
- ఉన్నత స్థాయి దర్యాప్తు



రాజా సహాణి



మధుకాంత కుమార్

భువనేశ్వర్: కటక్ జిల్లా చౌద్వార్ సర్కిల్ జైలు నుంచి ఇద్దరు ఖైదీలు తప్పించుకున్నారు. ఇది రాష్ట్రంలో అతి పెద్ద కారాగారం. కరడు దేరిన నేరస్తులను ఖైదీలుగా నిర్బంధిస్తారు. గురువారం రాత్రి జైలు గోడ దూకి ఖైదీలు ఉడాయించారు. రాష్ట్రంలో జైలు భద్రత ప్రశ్నార్థకమైంది. పారిపోయిన ఇద్దరు ఖైదీలు బీహార్ ప్రాంతీయులు. వారిలో మధుకాంత్ కుమార్, రాజా సహాణి బిహారీ బందిపోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. వీరివురు పాణికొయిలిలో ఆభరణాల దుకాణం దోపిడీలో నిందితులు. దోపిడి సందర్భంగా వారు జరిపిన కాల్పుల్లో ఒక వ్యక్తిని కూడా చంపారు. ఈ నేపథ్యంలో వీరివురి వ్యతిరేకంగా దోపిడీ, హత్య ఆరోపణలపై కేసులు నమోదు చేసి ఈ జైలులో పెట్టారు. ఖైదీలను అరెస్టు చేయడానికి కటక్ జోన్-1 ఏసీపీ, చౌద్వార్ పోలీస్ ఠాణా అధికారి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఉన్నత స్థాయి దర్యాప్తు

కటక్ రేంజ్ డీఐజీ ఆదేశాలు మేరకు ఈ సంఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తు ప్రారంభించారు. జైలు డీఐజీ ప్రత్యక్షంగా ఘటనా స్థలం సందర్శించారు. ఆమెతో చౌద్వార్ ఠాణా ఇనస్పెక్టర్ ఇన్‌చార్జి ఉన్నారు. సైంటిఫిక్ బృందం మరియు స్నిఫర్ డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలం చేరుకుని పరిశీలన చేస్తుంది. చౌద్వార్ ఠాణా పోలీసులు దర్యాప్తు కోసం 4 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

వార్డర్లు సస్పెండ్

ఖైదీలు పరారీ సంఘటన పురస్కరించుకుని ఇద్దరు వార్డర్లను సస్పెండ్ చేశారు. వీరిలో ఒకరు చీఫ్ వార్డెన్. పారిపోయిన ఖైదీలు కంబళ్లు చించి తాళ్లుగా పేనుకుని గోడ దూకి పారిపోయినట్లు ప్రాథమిక పరిశీలనలో గుర్తించినట్లు జైలు డీజీ సుశాంత్ నాథ్ తెలిపారు.

ఆచూకీ తెలిపితే రూ. 50,000

చౌద్వార్ జైలు నుండి తప్పించుకున్న ఖైదీల గురించి విశ్వసనీయ సమాచారం ఇచ్చిన వారికి రూ. 50,000 నగదు పురస్కారం ప్రకటించారు. చౌద్వార్ సర్కిల్ జైలు నుంచి తప్పించుకున్న విచారణ అధీన ఇద్దరు ఖైదీలను గుర్తించడంలో మరియు పట్టుకోవడంలో సహాయం చేయాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజా సహాణి బీహారు రాష్ట్రం బెగుసరాయ్ జిల్లా ముఫ్సిల్ ఠాణా లోహియా గ్రామస్తుడు కాగా మధుకాంత కుమార్ బీహారు రాష్ట్రం సారాణొ జిల్లా గౌర్ ఠాణా రామ్‌పూర్ గ్రామస్తుడుగా వివరాలు జారీ చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని అధికారులు హామీ ఇచ్చారు. సమాచారం తెలిస్తే సహాయక పోలీసు కమిషనరు 9437148161, చౌద్వార్ ఠాణా ఇన్‌స్పెక్టర్‌కు 9338025119కు సమాచారం అందించాలన్నారు.

పాంచ్‌సాఫ్ట్ కార్యాలయానికి సీలు

- ఎస్ఐ పోస్టుల కుంభకోణం కేసులో ముందడుగు

భువనేశ్వర్:

ఒడిశా పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) నియామక మోసం కేసులో ఒడిశా క్రైమ్ బ్రాంచ్ నిర్ణయాత్మక చర్య తీసుకుంది. తాజా చర్యలో భాగంగా స్థానిక ఇన్ఫో సిటీ ప్రాంతంలో పాంచ్ సాఫ్ట్ కార్యాలయాన్ని సీల్ చేశారు. అనుబంధ పత్రాలను పరిశీలిస్తున్నారు. దర్యాప్తు వర్గాల సమాచారం ప్రకారం పాంచ్‌సాఫ్ట్ యజమాని శంకర్ పృష్టి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. క్రైమ్ శాఖ వర్గాలు అతని కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి. మరో వైపు ఈ కుంభకోణంలో పాత్రధారి సందిగ్ధంతో సిలికాన్ సీఈఓ సురేష్ నాయక్‌ను కటక్ ప్రాంతంలో క్రైం శాఖ ప్రధాన కార్యాలయంలో ప్రశ్నించింది.

ఒడిశా పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఓపీఆర్‌బీ) స బ్ ఇన్‌స్పెక్టర్ నియామక పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాల తయారీని సిలికాన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అవుట్‌సోర్స్ చేసిందని దర్యాప్తులో తేలింది. శంకర్ పృష్టి ఆధ్వర్యంలో సిలికాన్ సంస్థ పాంచ్‌సాఫ్ట్‌కు సబ్‌కాంట్రాక్ట్ ఇచ్చింది. ఈ అవుట్‌సోర్సింగ్ ఏర్పాటు నియామక సమగ్ర ప్రక్రియ స్పష్టం కావాల్సి ఉంది. ఈ కుంభకోణంలో మరో కీలక వ్యక్తి మున్నా మహంతి కూడా పరారీలో ఉన్నాడు. ఈ మోసంలో శంకర్ పృష్టి, మున్నా మహంతిని కీలక పాత్రధారులుగా భావిస్తున్నారు. వీరివుర్ని పట్టుకోవడానికి క్రైమ్ శాఖ పోలీసులు ప్రయత్నిస్తున్నారు. వీరు 117 మంది అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లతో పరారీలో ఉన్నారు. ఎస్ఐ పరీక్షల కుంభకోణంలో సీనియర్ పోలీసు అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల ప్రమేయం ఉందని ఆరోపణలు బలంగా వ్యాపిస్తున్నాయి. ఇప్పటివరకు 114 మంది అభ్యర్థులు, 3 మధ్యవర్తులు, దళారులు సహా మొత్తం 117 మందిని అరెస్టు చేశారు. ఆశ్చర్యకరంగా అరెస్టయిన వారిలో మాజీ, ప్రస్తుత పోలీసు అధికారుల కుమారులు, కుమార్తెలు ఉన్నట్లు సమాచారం కలకలం రేపుతుంది. శంకర్ పృష్టి గంజాం జిల్లా సెరొగొడొకు చెందినవాడు. ఎక్కువ సమయం భువనేశ్వర్‌లో గడుపుతున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. పాంచ్‌సాఫ్ట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో అతనికి ఉన్న సంబంధం అస్పష్టంగానే ఉంది. బరంపురంలో దాని వ్యవహారాలు, కార్యకలాపాల కోసం లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

బీజేడీ సోషల్ మీడియా కన్వీనర్‌గా ఈశ్వర్ అల్లాడ

కొరాపుట్: ప్రతిపక్ష బిజూ జనతాదళ్ కొరాపుట్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా ఈశ్వర్ అల్లాడ నియమితులయ్యారు. శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దేవీ ప్రసాద్ మిశ్ర ఈ నియామకం చేస్తున్నట్లు ప్రకటించారు. కొరాపుట్ జిల్లా సిమిలిగుడకి చెందిన ఈశ్వర్ అల్లాడ బీజేడీ పార్టీకి గత రెండు దశాబ్దాలుగా పని చేస్తున్నారు. గతంలో కూడా జిల్లా స్థాయిలో పదవులు నిర్వహించారు. ఈశ్వర్ నియామకంపై జెడ్పీ ప్రెసిడెంట్ సస్మితా మెలక,కేసిసి బ్యాంక్ ప్రెసిడెంట్ ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహీ, మాజీ ఎంపీ జిన్ను హిక్కా, మాజీ మంత్రి రబినారాయణ నందో, మాజీ ఎమ్మెల్యేలు రఘురాం పాడాల్, పీతం పాఢీ, ప్రఫుల్ల పంగి లు అభినందనలు తెలియజేశారు.

8 నుంచి ఆధార్ శిబిరాలు

శ్రీకాకుళం అర్బన్ : ఈ నెల 6 నుంచి 10 వరకు జాతీయ తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తపాలాశాఖ సూపరింటెండెంట్ వి.హరిబాబు శుక్రవారం తెలిపారు. శ్రీకాకుళం డివిజన్ ప్రజలకు ఆధార్ నమోదు, అప్‌డేట్ సేవలు అందించేందుకు ఈ నెల 8 నుంచి 14 వరకు డివిజన్ అంతటా ఆధార్ క్యాంపులను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, టెక్కలితో పాటు రాజాం, కొత్తూరు, పాందూరు, కోటబొమ్మాళి, హిరమండలం సబ్ పోస్టాఫీసుల్లో శిబిరాలు సాగుతాయని వివరించారు. కాశీబుగ్గ, పాతపట్నం, శ్రీకాకుళం పాఠశాలల్లో శిబిరాలు కొనసాగుతాయని తెలిపారు.

స్వచ్ఛంద సేవకులు ముందుకు రావాలి

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలో వర్షాలు, వరద ముంపు తాకిడి అధికంగా ఉన్నందున ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సేవలు అందించేందుకు యువకులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు శుక్రవారం పిలుపునిచ్చారు. జిల్లా, మండలాల స్థాయిలో వైపరీత్యాల నష్ట నివారణ కమిటీ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించామని తెలిపారు. గతంలో ప్రథమ చికిత్స శిక్షణ పొందినవారు, రెడ్‌క్రాస్ పాట్రన్స్, జీవిత కాల సభ్యులు వైస్ పేట్రన్స్, లైఫ్ అసోసియేట్స్, గతంలో సేవలందించిన వైపరీత్యాల కమిటీ సభ్యులు, 18 నుంచి 40 ఏళ్లలోపు ఆరోగ్యవంతులు ముందుకు రావాలని కోరారు. వివరాలకు 9440490525, 9948633398 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

చెట్టుపడి వాహనదారుడికి గాయాలు

పోలాకి : వాహనచోదకుడిపై చెట్టుపడటంతో తీవ్రంగా గాయపడిన ఘటన పోలాకి మండలం రాళ్లపాడులో చోటు చేసుకుంది. నరసన్నపేట-పోలాకి ప్రధాన రహదారిలో రాళ్లపాడు వద్ద రహదారికి ఆనుకుని కొన్ని తాటిచెట్లు ఉన్నాయి. అందులో ఓ చెట్టు కొన్నాళ్ల క్రితమే పిడుగుపాటుకు గురై ప్రమాదకరంగా మారింది. గురువారం అటుగా బైక్‌పై వెళ్తున్న రాళ్లపాడు గ్రామానికి చెందిన బోర నీలం అనే వ్యక్తిపై తాటిచెట్టు అకస్మాత్తుగా పడింది. దీంతో తీవ్రంగా గాయపడినట్లు కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపారు. అయితే, చెట్టు రహదారిపై పడిన తరువాత వాహనచోదకుడు చూసుకోకుండా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు, రెవెన్యూ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఏదిఏమైనా అధికారుల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని కుటుంబ సభ్యులు, స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆన్‌లైన్‌లోనే డ్వాక్రా రుణాల చెల్లింపు

రణస్థలం: డ్వాక్రా సంఘాల సభ్యులు ఇకపై డిజిటల్ మోడల్ కాంటెక్స్ ప్రోటోకాల్ (ఎంసీపీ) ద్వారా బయోమెట్రిక్ వేసి ఆన్‌లైన్ విధానంలో రుణాలు చెల్లించాలని స్త్రీ నిధి ఇన్‌చార్జి బ్యాంకు లింకేజీ డైరెక్టర్ జి.వి.బి.డి.హరిప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. లావేరు మండలం తాళ్లవలసలో గ్రామ సంఘ సభ్యులకు డిజిటల్ ఎంసీపీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణ వాయిదాలు సకాలంలో చెల్లించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాలన్నీ ఎంసీపీ జమ చేస్తామన్నారు. సంఘ సభ్యురాలికి అవసరమైన మొత్తం ఎన్యుమరేటర్ లాగిన్‌లో యాన్యువల్ క్రెడిట్ ప్లాన్ తయారు చేసుకోవడానికి రెండు రోజులు అవకాశం ఉందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ లింకేజీ డీపీఎం ఏ.నాగలక్ష్మి, ఎల్‌హెచ్ డీపీఎం బి.నారాయణరావు, స్త్రీ నిధి ఏజీఎం వి.సత్యనారాయణ, ఏపీ ఎం బి. వి.సుబ్బయ్యనాయుడు, స్త్రీ నిధి మేనేజర్ కునుకు ఉదయ్‌కుమార్, సీసీలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని 17 గొర్రెలు మృత్యువాత

రణస్థలం: లావేరు మండలం సుభద్రపురం సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొని 17 గొర్రెలు మృతి చెందాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభద్రపురం గ్రామానికి చెందిన కోరాడ కోటేశ్వరరావు గొర్రెల మందను శుక్రవారం చీపురుపల్లి వైపు తోలుతుండగా శ్రీకాకుళం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో 17 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఘటనా స్థలాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పరిశీలించి బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. లావేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రాయగడ: గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఏడీఎం నాయక్, పక్కనే కలెక్టర్ కులకర్ణి



జయపురం: గాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న రబినారాయణ నందో తదితరులు



-పర్లాకిమిడి:విజేతలైన విద్యార్థులతో పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి



-పర్లాకిమిడి: జిల్లాస్థాయి గాంధీజీ వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్మలా శెఠి

మహాత్మునికి ఘనంగా నివాళి

రాయగడ:

స్థానిక గాంధీ పార్కులో మహాత్మగాంధీ జయంతిని గురువారం జిల్లా యంత్రాంగం ఘనంగా జరుపుకుంది. కలెక్టర్ అశుతోష్ కులకర్ణి, ఏడీఎం నవీన్ చంద్ర నాయక్, జిల్లా పౌరసంబంధాశాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్, విద్యావేత్త డీకే మహాంతి తదితర ప్రముఖులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. అనంతరం సర్వమత ధర్మాలకు చెందిన గ్రంథాలను ఆయా మతగురువులు చదివి వినిపించారు.

బీజేడీపాద యాత్ర

జయపురం: గాంధీ జయంతి సందర్భంగా జయపురం విధాన సభ నియోజకవర్గం బీజేపీ నాయకులు దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్ముని నిర్వహించిన భూమికను ప్రశంసిస్తూ పాదయాత్రం ప్రారంభించింది. రాష్ట్ర బీజేడీ ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి రబినారాయణ నందో నాయకత్వంలో వందలాదిమంది శ్రేణులు పాల్గొన్నాయి. ముందుగా జయపురం శాసనసభ నియోజకవర్గంలో జయపురం సమితి అంబాగుడ గ్రామ పంచాయతీ అంబాగుడలో గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర బీజేపీ జనసంపర్క అభిజాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పాద యాత్రలో మాజీ మంత్రి రబినారాయణ నందో మాట్లాడుతూ.. రాష్ట్ర పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదేశాల మేరకు గాంధీ జయంతిని జన సంపర్క అభిజాన్‌గా పాటిస్తున్నామని వెల్లడించారు. కొరాపుట్ జిల్లా బీజేడీ కార్యనిర్వాహక కార్యదర్శి దుర్గా ప్రసాద్ మిశ్ర, సీనియర్ నేత, జయపురం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ సూర్యనారాయణ రథ్ (మున్నా రథ్), కొరాపుట్ జిల్లా పరిషత్ మాజీ సభ్యులు బి.బాలంకిరావు, బొరిగుమ్మ సమితి సీనియర్ నాయకుడు నాగరాజు దొర, సీనియర్ నేతలు శివ పట్నాయక్, సత్యదాన్ మహానందియ, టున రథ్, లింగ రాజ్ పాత్రో, పింటు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: జాతీపిత మహాత్మాగాంధీ, శాంతిదూత లాల్ బహదూర్ శాస్త్రి జయంతి ఉత్సవాలను పర్లాకిమిడి గాంధీ స్మారక ప్రాథమిక అప్పర్‌గ్రేడ్ పాఠశాలలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. తొలుత గాంధీ జంక్షన్, గ్రంథాలయం వద్ద గాంధీ విగ్రహానికి పురపాలక సంఘం చైర్మన్ నిర్మలాశెఠి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ స్మారక ఉన్నత ప్రాథమిక పాఠశాలలో సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా విశ్రాంత తహసీల్దార్ పూర్ణచంద్ర మహాపాత్రో, ముఖ్యవక్తగా బిచిత్రానంద బెబర్తా, ప్రధాన ఉపాధ్యాయులు రవీంద్ర ప్రధాన్, డీపీఆర్వో ప్రదిప్త గురుమయి విచ్చేశారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలో విజేతలైన విద్యార్థులకు పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి బహుమతి ప్రదానం చేశారు.

జయపురం: మహాత్మా గాంధీ చిరస్మరణీయులని.. ఆయన దేశానికి స్వాతంత్ర్యం తీసుకు వచ్చిన మహానీయుడని వక్తలు అన్నారు. కొరాపుట్ జిల్లా వెనుకబడ్డ వర్గాల కాంగ్రెస్ సెల్ అధ్యక్షులు హసన్ మదాని ఆధ్వర్యంలో జాతిపిత గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిల జన్మదినోత్సం సందర్భంగా స్థానిక కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ భవనంలో కార్యక్రమం నిర్వహించారు. గాంధీ, శాస్త్రిల చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా హసన్ మదాని పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీ నిర్వహించిన భూమికను వివరించారు. అలాగే ప్రధానమంత్రిగా శాస్త్రిజీ దేశానికి అందించిన నిస్వార్థ సేవలు గుర్తు చేశారు. నేటి యువత గాంధీ, శాస్త్రిలు నచిచిన బాటలో పయనించి సమాజానికి సేవలు అందించాలని పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవికి పూజలు



జయపురం: పెంద్రానిదేవి లాఠీలకు పూజలు చేస్తున్న భక్తులు



పర్లాకిమిడి:పెద్దబ్రాహ్మణవీధి దుర్గా మాత విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న కమిటీ సభ్యులు



జయపురం: దసరా ఉత్సవాలకు జయపురం వచ్చిన పెంద్రాని దేవి



పెంద్రానిదేవి లాఠీలకు పూజలు చేస్తున్న భక్తులు



జయపురం: బలులు స్వీకరించే పెంద్రాని దేవి ప్రతినిధి లాఠీలు

మల్కన్‌గిరి: విజయదశమి సందర్భంగా దుర్గాదేవికి భక్తిశ్రద్ధలతో గురువారం పూజలు చేశారు. మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని దండకారణ్య పూజ మండపంలో బెంగాలీ మహిళలు ఘనంగా సిందూర్ ఖేలాను ఆడి సందడి చేశారు. దుర్గాపూజల్లో అమ్మవారికి సిందూర్ సమర్పించారు. అనంతరం ఒకరిపై ఒకరు సిందూర్‌ను పోసుకొని అమ్మవారి ఎదుట నాట్యం చేశారు.

హోమపూజలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని నక్టిమ్మా అమ్మవారి ఆలయం వద్ద శరన్నవరాత్రులు చేసిన భక్తులు చివరి రోజైన గురువారం అమ్మవారికి హోమ పూజలు చేశారు. తొమ్మిది రోజులు స్థానిక పురోహితురాలు లక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారిని రోజుకో అవతారంలో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. దీక్షబూనిన స్వాములు పూజల్లో పాల్గొన్నారు.

జయపురం: కుండపోత వర్షంలో సైతం దుర్గాదేవికి భక్తులు పూజలు చేశారు. ఆలయాల్లో, మండపాల్లో, గృహాల్లో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. . మా భగవతి మందిరం నుంచి అందంగా అలంకరించిన పల్లకీలో మా భగవతి, మా విజయ బయలు దేరగా మాదక్షిణ కాళీ, మా బసంత మయిలు కలసి అందమైన పల్లకీల్లో ఊరేగింపుగా రాజనగర్ కూడలి నుంచి ముందుకు సాగాయి. రాజ కోట నుంచి కనకదుర్గ పల్లకీ కూడా వాటితో బయలు దేరింది. ఊరేగింపులో పట్టణంలో వివిధ దుర్గా మండపాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి ప్రతిమలను చిత్ర విచిత్ర వేషధారులతో బాణసంచా కాల్చుతూ ప్రధాన ర్యాలీలో కలిశాయి. అర్ధరాత్రి రెండు గంటల వరకు సాగిన దసరా ర్యాలీలో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు. ముందుగా జరిగిన సభలో సాంస్కృతిక ప్రదర్శనలు , ప్రముఖులకు సత్కారాలు చేశారు. దసరా ఉత్సవాలలో యువరాజు విశ్వంబర చంద్ర చూడ్ దేవ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

సోమన్ వాంగ్‌చుంగ్‌ను విడిచి పెట్టాలి

- కమ్యూనిస్టు పార్టీ డిమాండ్



జయపురం ప్రధాన కూడలి వద్ద ర్యాలీ చేస్తున్న కమ్యూనిస్టు శ్రేణులు

జయపురం: జిల్లా కమ్యూనిస్టు పార్టీ జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని గురువారం నిర్వహించింది. ఈ సందర్భంగా 26వ జాతీయ రహదారి.. జయపురం ప్రధాన జంక్షన్‌లో ఆ పార్టీ ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రముఖ గాంధేయవాది, అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన విద్యావేత్త, పర్యావరణ ప్రేమికులు, వైజ్ఞానికులు వాంగ్‌చుంగ్‌ను విడిచి పెట్టాలని కమ్యూనిస్టు పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు ప్రమోద్ కుమార్ మహంతి మాట్లాడుతూ.. 2019లో జమ్మూ కశ్మీర్ 370 సెక్షన్‌ను కేంద్రంలో బీజేపీ ఎత్తి వేయటం, ఎన్నికల వాగ్దానంలో లేహ్ లదక్, కార్గిల్‌లకు పూర్తి రాజ్యాంగహోదా కల్గిస్తామని హామీ ఇచ్చినప్పటికీ అధికారంలోనికి వచ్చిన తరువాత వాటిని కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఉంచిందని ఆరోపించారు. ఆ ప్రాంతాల వారికి పర్వత ప్రాంతాలలో నివసిస్తున్న ఆదివాసీలకు ఇస్తున్న అధికారాలను వర్తింప చేయాలని కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు ప్రముఖ కార్మిక నేత ప్రమోద్ మహంతి కోరారు. కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శ రామకృష్ణ దాస్, నేతలు నంద కుమార్, హరికృష్ణ జాని పాల్గొన్నారు.

నదిలో దూకాడు.. రక్షించాక పరారయ్యాడు..



బోటులో నుంచి యువకుడిని బయటకు తెస్తున్న రెస్క్యూ సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని కంపోస్టు కాలనీ నీళ్ల ట్యాంకు సమీప నాగావళి నదిలో ఓ యువకుడు దూకి ఆత్మహత్యకు యత్నించాడు. తీరా అగ్నిమాపక రెస్క్యూ సిబ్బంది బయటకు తీసి రక్షించాక అక్కడి నుంచి కుటుంబీకులతో పరారయ్యాడు. శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. జిల్లా అగ్నిమాపక సహాయాధికారి శ్రీనుబాబు, ఒకటో పట్టణ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు...

గార మండలం రాళ్లపేట గ్రామానికి చెందిన బాకి రమణకు ఇద్దరు కుమారులు గణేష్, రాజు(24). గణేష్ హైదరాబాద్‌లోని కంపెనీలో పనిచేస్తుండగా.. రాజు బీటెక్ చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం ఇంట్లో గొడవ జరిగిందని, సూసైడ్ నోట్ రాసి బయటకు వచ్చేసినట్లు అక్కడి స్థానికులు చర్చించుకుంటున్నారు. అక్కడి నుంచి నగరంలోని దమ్మలవీధి సమీపంలో కొంతమందితో కలసి యువకుడు సాయంత్రం వరకు మద్యం సేవించినట్లు తెలుస్తోంది. రాత్రి అయ్యాక రాజు తన సోదరుడైన గణేష్‌కు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పడంతో వెంటనే ఫైర్‌సర్వీస్‌కు, ఒకటో పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. ఈలోగా నదిలో యువకుడు దూకేశాడు.

ఘటనా స్థలికి డీఎస్పీ..

వరదముంపుల్లో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్న ఎస్పీ ఆదేశాలతో అప్పటికప్పుడే డీఎస్పీ వివేకానంద సైతం ఘటనా స్థలికి వెళ్లారు. అప్పటికే ఏడీఎఫ్‌వో శ్రీనుబాబు రెస్క్యూ సిబ్బందిని నదిలో బోట్‌లో పంపించారు. నదిలో ఓ మూలన ఉన్న చెట్టుకొమ్మకు వేలాడి ఉన్న యువకుని వద్దకు చేరుకున్న సిబ్బంది సురక్షితంగా ఒడ్డుకు తెచ్చారు. చీకటిమయం కావడంతో అప్పటికే అక్కడికి చేరుకున్న రాజు కుటుంబీకులు ముగ్గురు తుప్పల మధ్య నుంచి తీసుకెళ్లి బండిపై వెళ్లిపోయారు. దీనిపై రూరల్‌సీఐ పైడపునాయుడు మాట్లాడుతూ యువకుడు క్షేమంగా ఉన్నట్లు చెప్పారు.

ఘనంగా దుర్గాదేవికి పూజలు

పర్లాకిమిడి:

దసరా శరన్నవరాత్రి వేడుకలు గురువారంతో వైభవంగా ముగిశాయి. చివరి రోజున పర్లాకిమిడిలో పలు కూడళ్లలో ప్రతిష్ఠించిన చేసిన దుర్గామాత విగ్రహాలను ఊరేగిస్తూ సమీపం చెరువులు, సాగరాల్లో నిమజ్జనం చేశారు. పెద్ద బ్రాహ్మణ వీధి, హైస్కూల్ జంక్షన్, కటిక వీధి, చిత్రకారవీధి, తెలుగు చాకలి వీధి వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాల నిమజ్జనోత్సవం అత్యంత ఆడంబరంగా ఉత్సవ కమిటీ సభ్యులు పూర్తి చేశారు. దుర్గామాతాలకు భక్తులుహారతులిచ్చి.. టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకొని సాగనంపారు. సీతా సాగరం వద్ద దుర్గా విగ్రహాల నిమజ్జనోత్సవాలను పూర్తి చేశారు.

పెంద్రాని దేవికి ప్రత్యేక పూజలు..

జయపురం: దసరా ఉత్సవాలకు పేరున్న పెంద్రాని గ్రామ ఉత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. నవరంగపూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పెంద్రాని గ్రామం నుంచి వచ్చిన పెంద్రాని దేవికే పట్టణ ప్రజలు అధిక ప్రాధాన్యతనివ్వడం ఆనవాయితీ. రాజుల కాలం నుంచి జయపురం దసరాలో పలు గ్రామ దేవతలో లాఠీలతో పాటు పెంద్రాణి దేవి లాఠీలు పాల్గొంటున్నాయి. ఈసారి కూడా పెంద్రాని దేవి ప్రతినిధిలుగా తీసుకొచ్చిన లాఠీలకు వేలాది మంది భక్తులు పూజలు చేశారు. పెంద్రాని దేవితో దిశారీలు పలు లాఠీలు, భాజా భజంత్రీలతో వచ్చారు. వారికి దేవదాయ విభాగం వారు ఆశ్రయం, వంటలు చేసుకోనేందు బియ్యం తదితర సౌకర్యాలు సమకూర్చారు. దసరా ఉత్సవాలలో అవిభక్త కొరాపుట్‌లో పలు గ్రామాల నుంచి 60 కి పైగా గ్రామ దేవతల లాఠీలు పాల్గొన్నట్లు దేవాలయ విభాగ అధికారులు వెల్లడించారు.



మల్కన్‌గిరి: ఆలయం వద్ద సిందూర్ ఖేళాలో మాహిళల సందడి



మల్కన్‌గిరి: సిందూర్ ఖేళాలో బెంగాల్ మహిళలు



జయపురం: దసరా ఊరేగింపులో కళాకారుల సందడి



జయపురం: ఊరేగింపులో పల్లకీలలో దేవతలు



జయపురం: ఊరేగింపులో దురువా నృత్యకారులు



జయపురం: గుజరాతీ కాలనీ దుర్గా మండపంలో దండియ నృత్యం



మల్కన్‌గిరి: హోమ పూజల్లో భక్తులు



మల్కన్‌గిరి: ప్రత్యేక పూజలందుకున్న దుర్గాదేవి

87 మంది పండిట్లకు పదోన్నతులు

సాక్షి ఎఫెక్ట్...



పదోన్నతుల ఉత్తర్వులను అందజేస్తున్న డీఈవో

శ్రీకాకుళం: జిల్లాలో పనిచేస్తున్న 87 మంది పండిట్లకు పదోన్నతులు కల్పిస్తూ డీఈవో రవిబాబు బుధవారం ఉత్తర్వులు అందజేశారు. వారు పనిచేస్తున్న పాఠశాలల్లోనే ఇకపై వీరంతా స్కూల్ అసిస్టెంట్లుగా కొనసాగుతారు. 'పదోన్నతులకు నోచుకోని పండిట్లు' పేరిట ఐదు రోజుల క్రితం సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో పండిత సంఘాల నాయకులు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్పందించారు. రాష్ట్రస్థాయిలో అధికారులను కలిసి సమస్యను వారి దృష్టికి తీసువెళ్లారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న పండితుల పదోన్నతుల సమస్యను తక్షణం పరిష్కరించాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో 65 మంది తెలుగు, 18 మంది ఒరియా, నలుగురు హిందీ పండిట్లకు పదోన్నతులు లభించాయి. బుధవారం డీఈవో కార్యాలయంలో పదోన్నతుల ఉత్తర్వులను అందజేశారు. పదోన్నతులు కల్పించడం పట్ల భాషా ఉపాధ్యాయ సంస్థ నాయకులు పిసిని వసంతరావ, రంగనాయకులు, ఉపాధ్యాయ పండిత పరిషత్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

6న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవార్డులు ప్రదానం

శ్రీకాకుళం పాతబస్టాండ్ : ఈ నెల 6న స్వర్ణాంధ్ర - స్వర్ణాంధ్ర అవార్డులు ప్రదానం చేయనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వారికి అవార్డులు అందజేసేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిర్ణయించిందని, పారిశుధ్య కార్మికులు, ఉద్యోగులు, పబ్లిక్ రిప్రజెంటేటివ్స్, ప్రజలు.. ఇలా ఎవరు బాగా పనిచేసినా అవార్డు అందుతుందన్నారు. అన్ని శాఖలను పరిగణనలోకి తీసుకొని 51 అవార్డులు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గ్రీన్ స్పాట్ ట్రాన్స్ఫర్మేషన్ 83 పాయింట్ల లక్ష్యాన్ని రెండు వారాల్లో చేరుకున్నట్లు తెలిపారు. డై అండ్ నైట్ వంతెన కింది భాగంలో ఇకపై మెడికల్ వ్యర్థాలు పారబోస్తే చర్యలు తప్పవని మెడికల్ ల్యాబ్స్, మెడికల్ షాపులు, ఆస్పత్రులను హెచ్చరించినట్లు చెప్పారు. సఫాయి మిత్ర సురక్ష శిబిర్‌లో భాగంగా పారిశుద్ధ్య కార్మికుల కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీల్లో, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రకటిస్తామన్నారు. జీఎస్టీ తగ్గింపుపై నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 19న షాపింగ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి పాత ధరలు, తగ్గింపు ధరలపై అవగాహన కల్పిస్తామన్నారు. పాఠశాలలు, ఉన్నత పాఠశాలలో జీఎస్టీ తగ్గింపు వలన ఉపయోగం గూర్చి తెలియజేస్తారన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

నరసన్నపేట : జాతీయ రహదారిపై కోమర్తి పెట్రోల్ బంకు వద్ద గురువారం ఆగి ఉన్న ఆటోను వెనుక వస్తు న్న మరో ఆటో అదుపు తప్పి ఢీకొట్టింది.

ఈ ఘటనలో వెనుక ఆటోలో ఉన్న అంపోలు గ్రామానికి చెందిన ధర్మాన సంధ్య, దంత జయశ్రీ, దంత కనకమహాలక్ష్మి, జమ్ము రాజేశ్వరమ్మలకు గాయాలయ్యాయి. వీరంతా పోలాకి మండలం గొల్లవలస వెళ్లేందుకు మునసబుపేటలోని గాయత్రీ కళాశాల వద్ద ఆటో ఎక్కారు. దేవాడి దాటిన తర్వాత పెట్రోల్ బంకు వద్దకు వచ్చే సరికి ముందున్న ఆటోను బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. నరసన్నపేట ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

7న భామినిలో జాబ్‌మేళా : కలెక్టర్

పార్వతీపురం రూరల్: భామినిలోని ఏపీ మోడల్ స్కూల్లో ఈ నెల 7న జాబ్‌మేళా జరగనుందని కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 7న ఉదయం 9గంటల నుంచి జాబ్ మేళా జరుగుతుందని, 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని 18 సంవత్సరాలు నిండి 30 ఏళ్లలోపు వయసు గల నిరుద్యోగ యువతీ యువకులందరూ జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఈ జాబ్ మేళాకు 10 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను కంపెనీలోకి ఎంపిక చేసుకుంటారని వివరించారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నంబరుతో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఉదయం 9 గంటలకు డ్రైవ్ జరిగే ప్రదేశానికి హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. మరిన్ని వివరాలకు 6301275511 లేదా 9000308185 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

చెక్ బౌన్స్ కేసులో జైలుశిక్ష

గజపతినగరం: బొండపల్లి మండలం గొట్లాం గ్రామానికి చెందిన సిడగం నాగరాజు అదే మండలం అంబటివలస గ్రామానికి చెందిన పల్లా ఈశ్వరరావుకు రూ.5లక్షలు అప్పుగా ఇచ్చాడు. అప్పుగా ఇచ్చిన నగదును తీర్చేందుకుగాను నాగరాజుకు ఈశ్వరరావు ఐదు లక్షల రూపాయలు డ్రా చేసుకోవాలని చెక్ ఇచ్చాడు. తీరా చెక్ బౌన్సు కావడంతో నాగరాజు కోర్టును ఆశ్రయించాడు. దీనిని పరిశీలించిన స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ జడ్జ్ ఎ.విజయ్‌రాజ్ కుమార్ నిందితుడు పిల్లా ఈశ్వరరావుకు రెండేళ్ల జైలు శిక్ష, 9లక్షల 95వేలు నగదును నాగరాజుకు ఇవ్వాలని, 5వేలు రూపాయలు ప్రభుత్వానికి కట్టాలని శుక్రవారం తీర్పు ఇచ్చినట్టు కోర్టు సిబ్బంది తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో 11 మందికి గాయాలు

వంగర: మండల పరిధి శ్రీహరిపురం, శ్రీహరిపురం ఆర్అండ్ఆర్ కాలనీ గ్రామాల్లో పిచ్చికుక్క స్వైర విహారం చేసి 11 మందిని గాయపరిచింది. శుక్రవారం వేకువజామున శెట్టి సరోజినమ్మ, టొంపల అప్పడు, గుడివాడ భాషందొర, బోగి లక్ష్మమ్మ, బెజ్జిపురం వెంకటనాయుడు, ఉద్దవోలు సంగులు, ఇంట్రంజి చిన్నమ్మడు, వావిలపల్లి బోడమ్మతో పాటు మరికొంత మందికి తీవ్రంగా గాయపరిచింది. దీంతో ఇరు గ్రామాలకు చెందిన బాధితులు అరసాడ, రాజాంలోని ఆసుపత్రులకు వెళ్లి చికిత్స తీసుకున్నారు. అరసాడలో వైద్యాధికారి కె.ఈశ్వరరావు బాధితులకు చికిత్స అందించారు. అనంతరం పిచ్చికుక్కను ఇరు గ్రామాల ప్రజలు హతమర్చారు.

విద్యుత్ షాక్‌కు గురై ఐదు గేదెల మృతి



తెగిన విద్యుత్ వైరు తాకడంతో మృతి చెందిన గేదెలు

గజపతినగరం: విద్యుత్ హెచ్‌టీ వైరు తెగిపడి ఉండడంతో తాకిన ఐదు గేదెలు మృతి చెందిన సంఘటన మండలంలోని చిట్టాయవలస గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. చిట్టాయవలస గ్రామానికి చెందిన లెంక లక్ష్మీనారాయణకు ముర్రా జాతికి చెందిన నాలుగు గేదెలు, ఒక ఆడ పెయ్యి ఉన్నాయి. ఆడ పెయ్యి రూ.70వేలు కాగా, నాలుగు గేదెల విలువ రూ.10లక్షలు ఉంటుందని తెలిపారు. ఇవన్నీ గ్రామ హౌసింగ్ కాలనీ ఎదురుగా మేత మేస్తూ అక్కడ ముందే తెగిపడి ఉన్న మెయిన్ విద్యుత్ వైర్లుకు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. వీటిలో రెండు గేదెలు చూడితో ఉన్నాయి. వీటి మృతితో యజమాని కన్నీరుమున్నీరవుతున్నాడు. తమ కుటుంబ జీవనానికి ఆసరాగా ఉండే పాడి గేదెలు మృతి చెందడంతో ఎలా బతికేదని రోదిస్తున్నాడు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నాడు.

జీఎస్టీ తగ్గింపును సద్వినియోగం చేసుకోండి

పూసపాటిరేగ: కేంద్ర ప్రభుత్వం చేసిన జీఎస్టీ శ్లాబ్‌ల సవరణ కారణంగా ఏర్పడిన జీఎస్టీ తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వైఎస్ఆర్ నాయుడు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జీఎస్టీ కొత్త శ్లాబ్‌లపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ముఖ్యంగా వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, సామగ్రి తగ్గిన జీఎస్టీని తెలిపారు. వ్యవసాయానికి ఉపయోగించే ట్రాక్టర్లపై ఇదివరకు ఉన్న 12 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించడం జరిగిందని, వాటి విడిభాగాల కొనుగోళ్లపై ఇదివరకు ఉన్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి, స్ప్రింక్లర్లపై ఉన్న 12 శాతం జీఎస్టీ 5 శాతానికి తగ్గించడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.నీలిమ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో పెరుగుతున్న ఊబకాయం..!

- ఊబకాయం వల్ల వ్యాధులు బారిన పడే అవకాశం
- తక్కువ వయసులో బీపీ, షుగర్ గుండె పోటుకు గురయ్యే అవకాశం
- అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 239 మంది ఊబకాయం ఉన్న పిల్లలు
- పెద్దవారిలోనూ అదే పరిస్థితి



ఊబకాయం

విజయనగరం ఫోర్ట్: బర్గర్లు, పిజ్జాలు, పానీపూరీ, నూడిల్స్ వంటి జంక్ ఫుడ్స్ తినడానికి ప్రస్తుతం ఉన్న పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. పిల్లలు మారం చేస్తున్నారని పిల్లలు ఏది అడిగితే అది తల్లిదండ్రులు కొని ఇచ్చేస్తున్నారు. పిల్లలతో పాటు పెద్దవారు కూడా జంక్ ఫుడ్స్ తింటున్నారు. ఫలితంగా పిల్లలు ఊబకాయం బారిన పడుతున్నారు. ఇది అనేక అనర్థాలకు దారి తీస్తుంది. ఊబకాయం రావడం వల్ల పిల్లలు అనేక వ్యాధులు బారిన పడే అవకాశం ఉంది. ఇటీవల చిన్న పిల్లలు కూడా గుండె పోటుకు గురవుతున్నారు. మరి కొంతమంది షుగర్, బీపీ, గుండె జబ్బులు బారిన పడుతున్నారు.

ఊబకాయంతో ఆపసోపాలు

చిన్న వయసులోనే ఊబకాయం రావడంతో పిల్లలు ఆపసోపాలు పడుతున్నారు. చిన్నపాటి పరుగు తీసినా అలసిపోవడం, ఆయాసంతో ఇబ్బంది పడుతున్నారు. జంక్ ఫుడ్స్ తినడం వల్ల పిల్లలు ఎక్కువగా ఊబకాయం బారిన పడుతున్నారు. గతంలో పిల్లలకు ఇంట్లోనే తయారు చేసి పిండి వంటలు పెట్టేవారు. నువ్వు ఉండలు, వేరుశనగ ఉండలు వంటి ఐరన్ సమృద్ధిగా ఉండేవి పెట్టేవారు. ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా పెట్టేవారు. దీంతో పిల్లలు ఆరోగ్యంగా ఉండేవారు. దీనికి తోడు పిల్లలు ఎక్కువగా ఆటలు ఆడుకునే వారు. దీంతో ఎంతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఉండేవారు. ఇప్పుడు పిల్లల పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పిల్లల్లో శారీరక శ్రమ ఉండడం లేదు. మొబైల్ ఫోన్లుకు అతుక్కుపోతున్నారు. దీనివల్ల వారు ఊబకాయం బారిన పడుతున్నారు. శరీరంలో అధిక కొవ్వు నిల్వలు ఉండడం వల్ల ఊబకాయం వస్తుంది. ఉండాల్సిన బరువు కంటే పిల్లలు ఎక్కువ బరువు ఉంటారు. శరీరానికి అవసరమైన దాని కంటే ఎక్కువ కేలరీలను ఆహారం ద్వారా తీసుకోవడం వల్ల ఊబకాయం వస్తుంది. అధిక కొవ్వులు, స్వీట్స్, ప్రాసెస్ చేసిన ఆహారాలు శీతల పానీయాలు వంటి అనారోగ్యకరమైన ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల అదనపు కేలరీలు శరీరంలో కొవ్వుగా పేరుకుపోతాయి.

ప్రాజెక్టులు వారీగా ఊబకాయం ఉన్న పిల్లలు

ప్రాజెక్టు	ఊబకాయం ఉన్న పిల్లలు
భోగాపురం	60
విజయనగరం	56
రాజాం	31
చీపురుపల్లి	18
బొబ్బిలి	16
వియ్యంపేట	15
ఎస్.కోట	12
బాడంగి	11
గంట్యాడ	08
గజపతినగరం	07
గరివిడి	05

ఉబకాయం వల్ల వచ్చే అనర్థాలు

ఊబకాయం ఉన్న వాళ్లు మెట్లు ఎక్కడానికి, నడవడం వంటివి చేసినా కూడా ఊపిరి అందక ఇబ్బంది పడతారు. శరీరం అధిక బరువును మోయడానికి ఎక్కువ శక్తిని వినియోగించడం వల్ల తరుచుగా అలసటగా అనిపించడం, సాధారణ పనులు చేయడానికి కూడా శక్తి లేనట్టు అనిపిస్తుంది. అధిక శరీర బరువు మోకాళ్లు తుంటి పాదాలు, వెన్నెముక వంటి వాటిపై అసాధారణ ఒత్తిడిని కల్గిస్తుంది. దీని వల్ల కీళ్ల అరుగుదలకు దారి తీసి తీవ్రమైన నొప్పులకు కారణమవుతుంది. చర్మం మడతలలో మెడ, గజ్జలు, చంకలు తేమ పేరుకు పోయి దద్దుర్లు, దురద, ఇన్‌ఫెక్షన్లు వంటి చర్మ సమస్యలు తరచుగా వస్తాయి. ఊబకాయం వల్ల మధుమేహం, గుండె జబ్బులు, పక్షవాతం, కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉంది. పెద్దపేగు, రొమ్ము, గర్భాశయ పొర, కిడ్నీ, కాలేయ కేన్సర్‌లు వచ్చే అవకాశం ఉంది.

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో..

జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 2499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 239 మంది ఊబకాయం ఉన్న పిల్లలు ఉన్నారు. భోగాపురం, విజయనగరం, రాజాం, చీపురుపల్లి, బొబ్బిలి, వియ్యంపేట, ఎస్.కోట, బాడంగి, గంట్యాడ, గజపతినగరం, గరివిడి ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం...



ఐసీడీఎస్ పరిధిలో 239 మంది పిల్లలు ఊబకాయంతో బాధపడుతున్నారు. దీని బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి నెల రోజులు పాటు నిర్వహించే రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో గర్భిణులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. సమతుల్యమైన ఆహారాన్ని అందించాలని చెబుతున్నాం. పిల్లలకు బయట ఆహారం కాకుండా ఇంటి వద్దే తయారు చేసి పెట్టాలని తల్లిదండ్రులకు తెలియజేస్తున్నాం.

– టి.విమలారాణి, పీడీ, ఐసీడీఎస్

పండ్లు, కూరగాయాలు తీసుకోవాలి

ఊబకాయం బారిన పడకుండా పండ్లు, కూరగాయాలు, తృణ ధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలి. స్వీట్స్, కొవ్వు, నూనె పదార్థాలు తగ్గించాలి. పానీపూరీ, నూడిల్స్, పిజ్జా, బర్గర్లు తినకూడదు. ఒకేసారి ఎక్కువగా కాకుండా తక్కువ మోతాదులో ఆహారం తీసుకోవాలి. రోజులో కనీసం 30 నుంచి 60 నిమిషాలు వ్యాయామం చేయాలి.

క్రైమ్ కార్నర్

వ్యక్తి ఆత్మహత్య...



ఆత్మహత్య చేసుకున్న అప్పలనాయుడు

విజయనగరం క్రైమ్ : నగరంలోని సూర్యనగర్‌లో మద్యానికి బానిస అయిన ఓ వ్యక్తి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి హెచ్‌సీ అప్పలనాయుడు తెలిపిన వివరాలు.. అప్పలనాయుడు(38) మద్యానికి బానిసై అప్పుల పాలయ్యాడు. అదే సమయంలో అనారోగ్యానికి గురయ్యాడు. చివరకు అప్పులు బాధ తాళలేక ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు అన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

మరో వ్యక్తి..

సీతానగరం: మండలంలోని కృష్ణారాయపురం గ్రామానికి చెందిన పెరుమాళి సింహాచలం(57) మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కృష్ణారాయపురం గ్రామానికి చెందిన సింహాచలం బుధవారం బొబ్బిలిలోని కుమార్తె ఇంటికి త్వరలో నిర్వహించనున్న నందెన్న ఉత్సవాలపై మాట్లాడేందుకు వెళ్లాడు. అక్కడ పిల్లలు తన మాట వినడం లేదని మనస్తాపానికి గురయ్యాడు. అక్కడి నుంచి స్వగ్రామం వస్తుండగా మార్గమధ్యలో కొన్న పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. ఇంటికొచ్చిన కొద్ది సేపటికే అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో భార్య గౌరీ, కుమారుడు కలిసి చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. భార్య పెరుమాళి గౌరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు.

రైలు ఢీకొని ఒకరు..

పార్వతీపురం రూరల్: బహిర్భూమికని వెళ్తూ రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పార్వతీపురం మండలం నర్సిపురం వద్ద చోటు చేసుకుంది. శుక్రవారం ఉదయం 8గంటల సమయంలో నర్సిపురం రైల్వే స్టేషన్ సమీపంలో గల ఎల్‌సీ గేటు వద్ద గల ఇదే గ్రామానికి చెందిన చందాన సింహాచలం (59) పట్టాలు దాటుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో బలమైన గాయాలు తగిలి అక్కడకక్కడే మృతి చెందినట్టు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మద్యం అనుకొని పురుగుల మందు తాగి...



పత్తిగుళ్ల రామకృష్ణ మృతదేహం

రామభద్రపురం: మండలంలోని జన్నివలస గ్రామానికి చెందిన వ్యక్తి మందు అనుకొని పురుగుల మందు తాగి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. జన్నివలస గ్రామానికి చెందిన పత్తిగుళ్ల రామకృష్ణ (47) మండల కేంద్రంలోని ఆల్ట్రాటెక్ సిమెంట్ గోదాంలో కళాసీగా పని చేస్తున్నాడు. ఈ నెల 28న మద్యం సీసా కొనుగోలు చేసి ఇంటికి వెళ్లాడు. ముందు రోజు పత్తి పంటకు పురుగుల మందు పిచికారీ చేసి మిగిలిన మందు దగ్గర మద్యం సీసా పెట్టాడు. అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో మద్యం సీసా అనుకొని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రథమ చికిత్స నిమిత్తం సాలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. భార్య సింహాచలం ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి ఒకరు...



బావిలో పడి మృతి చెందిన ఈశ్వరరావు

విజయనగరం క్రైమ్ : విజయనగరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బావిలో నీళ్లు తోడేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారి బావిలో పడి మృతి చెందారు. ఎస్ఐ అశోక్ శుక్రవారం తెలిపిన వివరాలు.. బియ్యాలపేటకు చెందిన చుక్క ఈశ్వరరావు(37) కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇంటికి అవసరం నిమిత్తం నీళ్ల కోసం గురువారం సమీపంలో ఉన్న బావి వద్దకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు జారి బావిలో పడిపోయాడు. నీళ్ల కోసం వెళ్లిన భర్త ఎంతకు ఇంటికి రాకపోవడంతో భార్య అప్పయ్యమ్మ బావి వద్దకు వెళ్లింది. అక్కడ బావిలో ఈశ్వరరావు మృతదేహమై కనిపించాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

గోడ కూలి ఒకరు...



గోడ కూలి మృతి చెందిన కుంబురిక అరవింద్

కురుపాం: మండలంలో వీచిన ఈదురు గాలులు, భారీ వర్షానికి ఉదయపురం పంచాయతీలోని ఉదయపురం కాలనీకి చెందిన ఇద్దరు అన్నదమ్ముళ్లపై శుక్రవారం ఉదయం మట్టి గోడ కూలడంతో కుంబురిక అరవింద్(23) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్నయ్య వినయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వినయ్‌ను స్థానికులు భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సంఘటనపై నీలకంఠాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని...



సుబ్బినాయుడు (ఫైల్)

రేగిడి: మండల పరిధిలోని ఉణుకూరు గ్రామంలో శుక్రవారం వేకువజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు అందించిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన వంజరాపు సుబ్బినాయుడు (65) వేకువజామున 4గంటల సమయంలో కాగితాపల్లి వైపు బహిర్భూమికి వెళ్తున్నాడు. అదే సమయంలో రాజాం నుంచి వచ్చిన వాహనం ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే బోర్లా పడ్డాడు. కొంత సమయం అటుగా ఎవరూ వెళ్లకపోవడంతో గుర్తించలేదు. దీంతో గ్రామానికి చెందిన కొంతమంది అటుగా వెళ్లి బోర్లా పడి ఉన్న వ్యక్తిని చూసే సరికి తీవ్రగాయాలతో పడి ఉన్నాడు. అప్పటికే మృతి చెందినట్టు గుర్తించారు. మృతుడు సుబ్బినాయుడుకు భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందడంతో భార్య బోరున విలపిస్తుంది. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బైక్ బోల్తా పడి వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన సాయికృష్ణ

సీతంపేట: దసరా పండగ పూట సరదాగా గడుపుదామని హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన పాలకొండ వచ్చి అక్కడ నుంచి సీతంపేట జగతపల్లి వ్యూ పాయింట్ చూడడానికి వచ్చిన పాలకొండకు చెందిన సాహిని సాయికృష్ణ (28) ద్విచక్ర వాహనం ఘాట్‌రోడ్‌లో అదుపుతప్పి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. వివరాలు పరిశీలిస్తే.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న మృతుడు కొద్ది రోజుల కిందట స్వగ్రామమైన పాలకొండకు వచ్చాడు. తన స్నేహితులతో కలసి మండలంలోని జగతపల్లి వ్యూ పాయింట్‌కు వచ్చారు. వేర్వేరు ద్విచక్ర వాహనాలపై వెళ్లిన వీరు తిరుగు ప్రయాణంలో బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి జగతపల్లి మలుపు వద్ద బోల్తా పడింది. భూరి అభిలాష్ డ్రైవ్ చేస్తుండగా వెనుక ఉన్న సాయికృష్ణకు తలపై తీవ్ర గాయమవ్వడంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్య సిబ్బంది శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం దసరా రోజున మృతి చెందినట్టు ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. మృతునికి తల్లి, సోదరుడు వంశీకృష్ణ ఉన్నారు. ఈయన మృతితో పాలకొండలోని కోటదుర్గమ్మ కాలనీలో విషాదం నెలకొంది. పండగపూట ప్రమాదవశాత్తు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు, మున్నీరై విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారన్నారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడు..



అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కార్మికుడు రాము

కొత్తవలస : మండలంలోని కంటకాపల్లి గ్రామం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఆల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారానికి చెందిన కాంట్రాక్టు కార్మికుడు తమటపు రాము(54) శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన చోటు చేసుకొంది. మృతుడు కుటుంబీకులు, సీఐ షణ్ముఖరావు తెలిపిన వివరాలు.. మండలంలోని బలిఘట్టాం గ్రామానికి చెందిన తమటపు రాము గతంలో జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ కర్మాగారంలో పని చేసేవాడు. కర్మాగారాన్ని గత ఏడాది అర్ధాంతరంగా మూసేయడంతో కంటకాపల్లి గ్రామ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఆల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో ఒక కాంట్రాక్టర్ వద్ద హౌస్ కీపింగ్ పనుల నిర్వహణకు జాయిన్ అయ్యాడు. గురువారం దసరా పండగ అయినప్పటికీ కర్మాగారానికి రాము వెళ్లాడు. మధ్యాహ్నం కర్మాగారం సమీపంలో గల చెరువులో పడి మృతి చెందాడు. రాము ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సమీపంలో వెతకడం ప్రారంభించారు. శుక్రవారం తెల్లవారుజామున కర్మాగారం సమీపంలో గల చెరువులో శవమై తేలాడు. దీంతో కుటుంబ సభ్యులు గుర్తించి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. కర్మాగారంలో విధులకు హాజరై అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో బంధువులు భోరుమని విలపించారు. మృతుడికి భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ షణ్ముఖరావు తెలిపారు.

భవానీ భక్తుడి మృతి



విజయనగరం క్రైమ్: కరెంట్ షాక్‌కు గురై మృతి చెందిన వెంకటేశ్వరరావు

విజయనగరం క్రైమ్ : విజయనగరంలో భవానీ మాల వేసుకున్న ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. టూటౌన్ ఏఎస్ఐ రామారావు తెలిపిన వివరాలు.. కాటవీధికి చెందిన కలవల్లి వెంకటేశ్వరరావు(41) దసరా సందర్భంగా భవానీ మాలాధారణ చేశాడు. దసరా రోజున ఇంట్లోనే పూజ చేసుకున్నాడు. తరువాత సమీపంలో తన ఆధీనంలో ఉన్న హరిణి వెల్డింగ్ షాప్‌నకు పనికి వెళ్లాడు. పని చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై పడిపోయాడు. చికిత్స నిమిత్తం సర్వజన ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించినట్టు ఏఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

భవానీ భక్తుని మృతదేహం లభ్యం



యోగేశ్వరరావు మృతదేహం

బాడంగి: మండలంలోని అల్లుపాల్తేరులోని వేగావతి నది ఒడ్డున భవానీ భక్తుడి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బొబ్బిలి పట్టణం కంచరవీధికి చెందిన కాటోజీ యోగేశ్వరరావు(21) శరన్నవరాత్రులు సందర్భంగా భవానీ మాల ధరించాడు. దసరా పండగ సందర్భంగా జె.రంగరాయపురం వద్ద వేగావతి నదిలో స్నానమాచరించేందుకు దిగాడు. ప్రమాదవశాత్తు నదిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం అల్లుపాల్తేరులోని వేగావతి నది ఒడ్డున యోగేశ్వరరావు శవమై తేలాడు. తండ్రి వీరాచారి ఫిర్యాదు మేరకు ఎస్ఐ తారకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా డిజిటల్ బుక్



డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: రాష్ట్రంలో అమలవుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగంలో అన్యాయానికి గురవుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులకు, ప్రజలకు రక్షణగా, అండగా ఉండేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ తీసుకువచ్చారని ఆ పార్టీ పీఏసీ సభ్యుడు, మాజీ ఉప ముఖ్య మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలోని తన స్వగృహం వద్ద పార్టీ నేతలతో కలిసి డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా సభ్యులు, నాటి ప్రభుత్వంలో పని చేసిన అధికారులపై అక్రమ కేసులు పెడుతూ తీవ్ర ఇబ్బందులు పెడుతుందన్నారు. అక్రమ కేసులపై కోర్టులు మొట్టికాయలు వేస్తున్న ప్రభుత్వ పెద్దల తీరు మారడం లేదన్నారు. బాధితులు డిజిటల్ బుక్‌లో తగు ఆధారాలతో నమోదు చేయాలన్నారు. అటువంటి వారి వివరాలను డిజిటల్ బుక్ డేటా బేస్‌లో భద్రపరచడం జరుగుతుందన్నారు. తప్పు చేసిన వారిని చట్టం ముందు నిలబెడతామన్నారు. కూటమి పాలనలో అన్యాయానికి గురవుతున్న ప్రతీ ఒక్కరికి డిజిటల్ బుక్‌తో అండగా ఉంటామన్నారు. రానున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కార్యకర్తలకు పెద్ద పీట వేస్తామన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఉప ముఖ్యమంత్రిగా వివిధ హోదాల్లో తాను ఏనాడూ ఏ అధికారిని చట్ట వ్యతిరేకంగా నడుచుకోమని చెప్పలేదని పేర్కొన్నారు. మంత్రి సంధ్యారాణి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ఎలా మాట్లాడుతున్నారో అందరూ గమనిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ పార్లమెంట్ కార్యదర్శి, మక్కువ జెడ్పీటీసీ మావుడి శ్రీనువాసులనాయుడు, పార్టీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల ప్రాణాలంటే అంత నిర్లక్ష్యమా?

- డీఎంహెచ్‌వోను అడ్డుకున్న గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు
- గురుకుల పాఠశాల ముందు ఆందోళన



గురుకులం వద్ద డీఎంహెచ్‌వోను అడ్డుకుంటున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

కురుపాం: గిరిజన విద్యార్థుల ప్రాణాలంటే మీకు అంత నిర్లక్ష్యమా..! ప్రాణాలు పోతున్నా స్పందించరా..? వసతిగృహంలో అసలేం జరుగుతుంది.. కొన్ని రోజులుగా విద్యార్థులు వరుసగా అనారోగ్యానికి గురవుతున్నా ఇలాగేనా.. స్పందిస్తారా... మీ పిల్లలు అనారోగ్యం బారిన పడితే ఇలాగే స్పందిస్తారా? అంటూ.. కురుపాం గురుకుల పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఐటీడీఏ అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలపై పర్యవేక్షణకు శుక్రవారం వచ్చిన డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావును వారు అడ్డుకున్నారు. పిల్లలు అనారోగ్యం, మరణాలపై పూర్తి సమాచారం ఇస్తేనే లోపలికి వెళ్లాలని ఐటీడీఏ అధికారుల తీరును ఎండగడుతూ నిరసన తెలిపారు. గిరిజన విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం సరికాదన్నారు. అల్లారు ముద్దుగా పెంచుకున్న తమ పిల్లలను ఉన్నత చదువుల కోసం సాలూరు, పార్వతీపురం, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కురుపాం తదితర దూర ప్రాంతాల నుంచి గురుకుల పాఠశాలలో చేర్పిస్తే తిరిగి అనారోగ్యంతో తమ పిల్లలను అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో అనారోగ్యం బారిన పడి ఎంతకీ తగ్గకపోవడంతోనే తాము తమ పిల్లలను వెంట తీసుకొని వెళ్తున్నామని సరైన వైద్యం, పర్యవేక్షణ ఉంటే ఎందుకు తీసుకువెళ్తామని ప్రశ్నించారు. విద్యార్థులు సెలవులకు వెళ్లిన తరువాతే అనారోగ్యం బారిన పడ్డారని తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.



ఐటీడీఏ అధికారుల తీరుకు నిరసనగా గురుకుల పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన సంఘం నాయకులు

మందుబాబుల వీరంగం



మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మందుబాబులు ధ్వంసం చేసిన గాంధీ విగ్రహం

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహాన్ని ఆయన జయంతి రోజు గురువారం కొంతమంది యువకులు మద్యంమత్తులో ధ్వంసం చేశారు. రూరల్ ఎస్ఐ నరసింహమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... సాయంత్రం 3 గంటల సమయంలో ఎంఈఓ-2 వెంకటరమణ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాలుగు గంటల సమయంలో 10 మంది యువకులు తప్పతాగి పాఠశాలలో వంటగది తలుపులు బద్దలగొట్టి అందులో వంట సామగ్రిని ధ్వంసం చేశారు. అనంతరం గ్రంథాలయం తలుపులు పగులగొట్టేందుకు ప్రయత్నించారు. తరువాత గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. హెచ్‌ఎం అయ్యప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ తెలిపారు. గాంధీ విగ్రహం తలను మళ్లీ యథావిధిగా హెచ్‌ఎం దగ్గరుండి అతికించారు.